ప్రజాశక్తి

బుధవారం 13 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఉమ్మడి గుంటూరు జిల్లాకు కీలక పదవులు

- శాసన సభ చీఫ్‌విప్‌గా జీవీ ఆంజనేయులు
- శాసన మండలి చీఫ్‌విప్‌గా పంచుమర్తి అనురాధ
- ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కన్నా లక్ష్మీనారాయణకు నిరాశ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

శాసన సభలో చీఫ్‌విప్‌గా వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, శాసన మండలిలో చీఫ్‌విప్‌గా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ నియమితులయ్యారు. రెండు కీలక పదవులు ఉమ్మడి గుంటూరు జిల్లాకు దక్కడం విశేషం. నామినేటెడ్ పదవుల పందేరంలో భాగంగా రెండు ఒకే జిల్లాకు రావడంపై ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు. శాసన సభలో చీఫ్ విప్ పదవి పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకు ఇస్తారని ప్రచారం జరుగుతున్నా అనూహ్యంగా జి.వి. ఆంజనేయులుకు ఈ పదవి దక్కింది. పల్నాడు ప్రాంతానికి మంత్రివర్గంలో స్థానం దక్కకపోవడంతో ఈ ప్రాంతంలో కొంత అసంతృప్తి ఉందనే వార్తల నేపథ్యంలో జి.వి.ఆంజనేయులుకు పదవిని కట్టబెట్టారు. 2004లో రాజకీయ అరంగేట్రం చేసిన జి.వి.ఆంజనేయులు తొలిసారిగా క్యాబినెట్ హోదా కలిగిన పదవిని పొందారు. 2004లో ఆంజనేయులు భార్య లీలావతికి పోటీ చేసే అవకాశం కల్పించారు. ఆమె అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కెన మల్లిఖార్జునరావు చేతిలో ఓటమి పాలయ్యారు. 2009లో జి.వి.ఆంజనేయులకు టిడిపి నుంచి పోటీ చేసి వినుకొండ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో ఓడిపోయినా తిరిగి 2024లో భారీ మెజార్టీలో గెలుపొందారు.

జీవీ ఆంజనేయులు

పంచుమర్తి అనురాధ

2023లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పంచుమర్తి అనురాధ గెలిచారు. టిడిపికి తగినంత బలం లేకపోయినా వైసిపి నుంచి జరిగిన క్రాస్ ఓటింగ్ ఫలితంగా ఆమె ఎమ్మెల్సీ పదవిని దక్కించుకున్నారు. అంతేగాక గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన నారా లోకేష్ విజయం కోసం ఆమె కృషి చేశారు. రెండు చీఫ్ విప్‌లు ఒకే ప్రాంతానికి కేటాయించడం ద్వారా రాజధాని ప్రాంతంలో పదవులు ఎక్కువగా

▶ 2లో

ధరల నియంత్రణను విస్మరించి భారాలు

- ప్రజా సమస్యలు పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ప్రజాపోరు ప్రచార యాత్రలో సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - నకరికల్లు, దుగ్గిరాల

పల్నాడు జిల్లా నకరికల్లులో బైక్ ర్యాలీ ప్రచారాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

గుంటూరు జిల్లా దుగ్గిరాలలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ప్రచార యాత్రలు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా నకరికల్లు, గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలాల్లో మంగళవారం ప్రచారం చేపట్టగా ఆయా జిల్లాల కార్యదర్శులు గుంటూరు విజయ్‌కుమార్, పాశం రామారావు హాజరయ్యారు. మండల కేంద్రమైన నకరికల్లులోని వై జంక్షన్‌లో బైక్ ర్యాలీ ప్రచారాన్ని విజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలేమీ తీసుకోవడం లేదని, వాటి బాధ్యతను విస్మరించి ప్రజలపై మరింత భారాలు మోపే పనిలో ఉన్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ బకాయిలు మోపగా వాటిని రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.6 వేలకోట్ల వసూలుకు విద్యుత్ సంస్థలకు అనుమతిచ్చిందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేస్తున్న జమిలీ ఎన్నికల నినాదం ఆర్‌ఎస్‌ఎస్ అజెండాలో భాగమన్నారు. వీటిని తిప్పికొట్టడం ద్వారా రాష్ట్రాల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, చిన్నారులపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం శివాపురం తండా, నరసింగపాడు, గుండ్లపల్లి, త్రిపురాపురం, చల్లగుండ్ల గ్రామాల్లో ప్రచారం సాగింది. సిపిఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు,

▶ 2లో

బెల్ట్ షాపును తొలగించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - చేబ్రోలు

నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలో అక్రమంగా మద్యం అమ్మడాన్ని నిరసిస్తూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో చేబ్రోలులో నిరసన తెలిపారు. మండలంలోని కొత్త రెడ్డిపాలెం చెన్నా రెడ్డి కాలనీ సెంటర్ వద్ద వల్లూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి అక్రమంగా మద్య అమ్మకాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ స్కూల్, కాలేజీ, పిల్లలు, మహిళలు నిరంతరం సంచరించే ప్రాంతంలో మద్యం అమ్మకాల వల్ల మహిళలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి బెల్ట్‌షాపులు అనుమతి లేదన చెబుతున్నారని, మరోవైపు ఆ పార్టీకి చెందిన వ్యక్తులు బెల్టు షాపులను నిర్వహిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇళ్ల మధ్య అమ్మడం వల్ల తాగినవాళ్లు చుట్టుపక్కల ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆదిశేషులు, శ్రీనివాసులు, కేలోతు లక్ష్మి, కేతావత్ చిలకమ్మ,తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి - అమరావతి

మండంలోని దిడుగులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. దిడుగు ఇసుక రీచ్ నుండి అనుమతులేమీ లేకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలింపు కొద్దిరోజులుగా సాగుతోంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సిఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇసుకను తరలిస్తున్న 11 లారీలను ఆపి పరిశీలించగా అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

16న షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - తాడికొండ

ఈనెల 16వ తేదీన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ అండర్-17, అండర్-19 బాలబాలికల జట్ల ఎంపికలు ఉంటాయని షూటింగ్ బాల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండలోని ఎస్‌వివి హైస్కూల్‌లో నిర్వహించే ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు హాజరవ్వాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ : 8639922978ను సంప్రదించాలని సూచించారు.

ధరల నియంత్రణను విస్మరించి భారాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇ.లక్ష్మారెడ్డి, ఇ.అప్పిరెడ్డి, రామాంజనేయ నాయక్, సిహెచ్.కోటేశ్వరావు, ఎ.వెంకటేశ్వర్లు, కొండా నాయక్ పాల్గొన్నారు.

మండల కేంద్రమైన దుగ్గిరాల ప్రచారంలో రామారావు మాట్లాడుతూ బడ్జెట్లో పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్‌కు కనీసం రూ.రెండు కోట్లు కూడా కేటాయించలేదని విమర్శించారు. ఈ మొత్తం కేటాయిస్తే 26 వేల ఎకరాలకు సాగునీరు సకాలంలో అందుతుందన్నారు. డెల్టా ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పంటలు ముంపుబారిన పడకుండా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. పంట కాల్వల్లో గుర్రపుడెక్క, తూటికాడను తొలగించాలని, కాల్వల మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో మురుగునీటి కాల్వల సమస్యను పరిష్కరించాలన్నారు. ఇసుక ధరలు మరింతగా పెరగడంతో ఈ ప్రభావం భవన నిర్మాణ కార్మికులపై పడి వారికి ఉపాధి తగ్గిందన్నారు. బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించలేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమ్మకు వందనం పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, మండల కార్యదర్శి జె.బాలరాజు, నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, వై.స్టాలిన్, ఎన్.యోగేశ్వరావు, శ్రీనివాసరావు, స్థానికులు బుజ్జి, మాణిక్యరావు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు కీలక పదవులు

(మొదటి పేజీ తరువాయి)

దక్కుతున్నాయని టిడిపి నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర మంత్రిగా ఉన్నారు. నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ మంత్రులుగా ఉన్నారు. ఇదే సమయంలో జిల్లాలో అత్యంత సీనియర్ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్రకు కూడా కీలక పదవులు వస్తాయని పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. సామాజిక సమీకరణలో కన్నాకు అవకాశం రాలేదంటున్నారు. పొన్నూరు నుంచి 1995 నుంచి 2014 వరకు ఐదుసార్లు వరసగా గెలిచిన నరేంద్ర 2019లో ఓడిపోయారు. 2024 నుంచి తిరిగి ఆరోసారి గెలిచారు. మంత్రి పదవి ఆశించినా కోరిక నెరవేరలేదు. బిజెపి నుంచి టిడిపిలో చేరిన కన్నాకు కూడా మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరిగినా ఆయనకూ అవకాశం దక్కలేదు.

8 మందికి సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని 8 మందికి రూ.4.64 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం భారిన పడిన పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రభుత్వం వారికి భరోసాగా నిలుస్తోందన్నారు.

జపాన్ విద్యావిధానంపై సిఎం చంద్రబాబు ఆసక్తి

- ఏపీలో అమలుకు పరిశీలన
- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తాత్కాలిక ఛైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జపాన్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

జపాన్‌లోని టోయామా ప్రీ ఫెక్చర్ యూనివర్సిటీలతో ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీలు, విద్యార్థి, అధ్యాపక, పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సూత్ర పాయ అంగీకారం లభించింది. మంగళవారం తోయమా ప్రీ ఫెక్చర్ నుంచి నలుగురు సభ్యుల బృందం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా 'కొలాబరేటివ్ డైలాగ్ ఆన్ ఎడ్యుకేషన్ బిట్వీన్ టోయామా ప్రీఫెక్చర్ అండ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై చర్చించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తాత్కాలిక ఛైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ జపాన్‌కు, ఇండియాకు చాలా అంశాల్లో పోలికలున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ దేశ విద్యా విధానాన్ని కొనసాగించే క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఉన్న జపాన్ విద్య విధానంపై ఏపీలో అమలు చేసే అంశాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో టొయామతో 2015లో ఎంఓయును పునరుద్ధరిద్దామని చెప్పారు. భారతదేశంలో యువత ఎక్కువగా ఉందని, మానవ వనరులను వివిధ దేశాలకు పంపనున్నామని చెప్పారు. జపాన్ విద్యా విధానంపై సిఎం చంద్రబాబు ఆసక్తిగా ఉన్నారన్నారు. రెండు దేశాల మధ్య చదువుకునే వీలును కల్పించడం, అధ్యాపకులు, బోధన పరిశోధన రంగాలను బలోపేతం చేసుకునేందుకు రెండు దేశాలకు పరస్పరం మార్పిడి చేసుకునేందుకు అవకాశాలను పరిశీలించాలన్నారు. విశ్వవిద్యాలయాలతో ఎంఓయులు కుదురుచుకునేందుకు తాము అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామన్నారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరారు. జపాన్ భాషపై ప్రత్యేక కోర్సును విద్యార్థులకు అందించాలని సూచించారు. వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ తమ వర్సిటీ నుంచి కొద్ది రోజుల క్రితం ఇద్దరు విద్యార్థులు సుకుర సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా టొయామ యూనివర్సిటీని సందర్శించి పలు అంశాల్లో నైపుణ్యాలు పెంచుకున్నారని చెపాప్పారు.

డిసెంబర్ పర్యటనతో ఎంఓయులపై స్పష్టత

అనంతరం ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ డైరెక్టర్ యూకో హెూంగో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌తో ఎంఓయులు కుదుర్చుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇక్కడి విధానాలను టొయమా యూనివర్సిటీలతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రీసెర్చ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాములు నెలల వ్యవధిలో ఉంటే మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. వచ్చే నెలలో టొయమ గవర్నర్ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఉంటుందని, ఆ పర్యటనలో ఎంఓయులు చేసుకోనున్నట్లు తెలిపారు. యూజీ, పిజీ, రీసెర్చ్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మసీ వంటి కోర్సులపై దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి వైస్ ఛైర్మన్ ఆచార్య ఉమామహేశ్వరిదేవి, ఇండస్ట్రియల్ లొకేషన్ అండ్ ట్రేడ్ డివిజన్ లాజిస్టిక్ అండ్ ట్రేడ్ డైరెక్టర్ హిదేహిస, ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ సెక్షన్స్ చీఫ్ ఏఐ డోబు, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మాజీ కో-ఆర్డినేటర్ డి.రమేష్, శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయ వీసీ వి.ఉమా, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వీసీ సిహెచ్. అప్పారావు, ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఎన్.కిషోర్ బాబు, జేఎన్టీయూ అనంతపురం వీసీ హెచ్.సుదర్శన్ రావు, జేఎన్టీయూ కాకినాడ వీసీ కెవిఎస్‌డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిసిఐ కేంద్రాల్లోనే పత్తిని అమ్ముకోండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పత్తిరైతులు తమ పంటను క్వింటాళ్ రూ.7521 మద్దతు ధరకు సిసిఐ ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. మండలంలోని కోనంకి, పాతగణేశునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ కందులు, వరి పంటలను సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల సరఫరా, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటు, ఈ-క్రాప్ నమోదు, పంటల బీమాపై వివరించారు. మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు మితిమీరి వాడితే పర్యావరణంతోపాటు భూసారం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, ఉమామహేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జంగా కృష్ణమూర్తికి సన్మానం

ప్రజాశక్తి- దాచేపల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల సభ్యులు జంగా కృష్ణమూర్తిని పల్నాడు బలహీన వర్గాల ఐక్యవేదిక సభ్యులు, ముస్లిమ్ అంజుమన్ కమిటీ సభ్యులు సోమవారం రాత్రి సన్మానించారు. స్థానిక బంగ్లా సెంటర్లో ఏర్పాటు చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో జంగా కృష్ణమూర్తి పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతిరావు పూలే, గుర్రం జాషువా విగ్రహాలకు పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కులమైనా ఏ మతమైనా అందరికీ మానవత్వం ముఖ్యమని అన్నారు. నాయకురాలు నాగమ్మ సైవ క్షేత్ర నిర్మాణానికి అనేకమంది సహకరించారని, నాయకురాలు నాగమ్మ నాడు ఏర్పాటు చేసిన శివాలయం శివలింగం పున: ప్రతిష్టను మార్చిలో నిర్వహిస్తామని చెప్పారు. తనను ఇంతటి వాడిని చేసిన ప్రజలకు, ప్రస్తుతం టిడిపి బోర్డులో స్థానం కల్పించిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులకు డ్రై ఫ్రూట్ పౌడర్ పంపిణీ

ప్రజాశక్తి-ఈపూరు: మండలంలోని ఎ.ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సత్య సాయి సేవా సంస్థ (నరసరావుపేట) ఆధ్వర్యంలో మంగళవారం 40 మంది గర్భిణులకు డ్రై ఫ్రూట్ పౌడర్‌ను పంపిణీ చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రతినెలా వీటి పంపిణీ ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 90 శాతం ఈవిధమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు ఉచితంగా భోజనం సంస్థ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నామని, రాష్ట్రంలో 10 లక్షలు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జెడ్పి పాఠశాలలో 200 మొక్కలను నాటారు. జిల్లా అధ్యక్షులు ఉమాధర్, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు ఎ.హరినాథ్‌బాబు, సంయుక్త కన్వీనర్ నాగరాజు, కె.హనుమయ్య పాల్గొన్నారు.

మున్సిపాల్టీలోనే జనన, మరణ ధ్రువపత్రాలు జారీ

ప్రజాశక్తి- మాచర్ల : పట్టణ పరిధిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు చేర్పుల కోసం ముందుగా మున్సిపల్ కార్యాలయంలోని జనన మరణ విభాగంను సంప్రదించాలని పురపాలక సంఘ కమిషనర్ వేణుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమను సంప్రదించి అవసరమైన అన్ని వివరాలు తెలుసుకొని తరుపరి మాత్రమే ఈ-సేవా కేంద్రం లేదా వార్డు సచివాలయంలో అర్జీ దాఖలు చేయాలని సూచించారు. 2016లోపు జన్మించిన వారి పత్రాలు కోసం ఈ-సేవా లేదా వార్డు సచివాలయంలో, 2017 తర్వాత జన్మించిన వారి ధ్రువపత్రాల కోసం మున్సిపల్ ఆఫీసు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రైతులకు రసీదులు తప్పకుండా ఇవ్వండి

ప్రజాశక్తి - నకరికల్లు : పురుగు మందులు, ఎరువులు అమ్మిన సందర్భంలో తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు సూచించారు. డీలర్లతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందుల వివరాలతో పాటు లాట్ నంబరు, రైతు సంతకం, దుకాణదారుని సంతకం, తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎంఆర్‌పికి మించి అమ్మితే సంబంధిత దుకాణదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం

ఆటల పోటీలు ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని, క్రీడలకు అందరూ ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల మైదానంలో రెండ్రోజులపాటు జరగనున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళా కబడ్డి పోటీలను వర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.పి.ఎస్ పాల్‌కుమార్‌తో కలిసి కోటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. అతిథులకు కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం కోటేశ్వరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రత్యేకంగా శిక్షణా ఇప్పిస్తున్నామని చెప్పారు. పోటీల్లో మొత్తం 11 జట్లు పాల్గొనగా మొదటి రౌండ్‌లో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలపై బాపట్ల మహిళ కళాశాల 10 పాయింట్లు తేడాతో గెలుపొందింది. నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ

కళాశాలపై నరసరావుపేట ఎంఎఎం ఫార్మసి కళాశాల జట్టు 4 పాయింట్లు తేడాతో విజయం సాధించింది. ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలపై విక్టరీ డిగ్రీ కళాశాల, గుంటూరు ఉమెన్స్ కళాశాల జట్టుపై ఎఎన్‌యు ఫిజకల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఎంఎఎం కాలేజీ జట్టుపై కృష్ణవేణి డిగ్రీ కాలేజి జట్లు విజయం సాధించి లీగ్ దశలోకి ప్రవేశించాయి. ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి ఆదిబాబు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణకు సహకరించాలి : కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దుకోవటంలో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ సహకరించాలని నగర కమి షనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కళ్యాణ మండ పాలు, ఫంక్షన్ హాల్స్‌లో నిషేదిత ప్లాస్టిక్ వినియోగించకుండా, జీరో వేస్ట్ ఈ వెంట్స్ చేపడుతూ జిఎంసికి సహకరించే వారికి ఆస్తిపన్నులో రాయితీ అందించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో జిఎంసి, ట్రాఫిక్ పోలీసులు, కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, హోటల్స్ యజమానులతో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ నగరంలో బల్క్‌గా వ్యర్థాలు విడుదలయ్యే కల్యాణ మండ పాలు, ఫంక్షన్‌హాల్స్, హోటళ్ళ నిర్వాహకులు స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాల మేరకు నిషేదిత ప్లాస్టిక్ వినియోగించకుండా, జీరో వేస్ట్ ఈవెంట్స్ నిర్వహణపట్ల శ్రద్ధ చూపాలన్నారు. వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని, అలా తయారు చేసిన ఎరువును జిఎంసి కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఫంక్షన్ హాల్ నుండి డ్రైన్‌లోకి మురుగు వచ్చే మార్గంలో మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని, పార్కింగ్‌ని రోడ్లమీద కాకుండా ప్రాంగణంలోనే ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. డ్రైన్లు మూసివేస్తూ ఏర్పాటు చేసిన ర్యాంపులను ఈనెల 25లోగా తొలగించుకోవాలని లేదంటే జిఎంసి తొలగి స్తుందన్నారు. త్వరలో కమర్షియల్ వ్యర్థాల సేకరణకు నూతన కాంట్రాక్టర్లను టెండర్ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పన్నులు ఎప్పటికప్పుడు చెల్లించాలని, ట్రేడ్ లైసెన్స్‌లు తప్పని సరిగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా లైసెన్స్‌లు పునరుద్ధరించు కోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాస రావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ట్రాఫిక్ సిఐలు అశోక్ కుమార్, సింగయ్య పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : తాగునీటి సరఫరా విషయంలో ఉదాశీనత సరికాదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కమిషనర్ సంజీవయ్య నగర్ రైల్వేగేటు వద్ద పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెడ్ వాటర్ వర్క్స్ నుండి వస్తున్న పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును యుద ్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని, పనుల్లో జాప్యం వలన నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలు ఎదురవు తున్నా యన్నారు.సరఫరా విషయంలో ఇంజినీరింగ్ అధికారులు ఉదా శీనంగా వ్యవహరించ కూడదని, పెండింగ్ సమస్యలు ఉంటే తక్షణం తమ దష్టికి తీసుకురావాలన్నారు.మరమ్మతుల పనులను 3 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ప్రజాశక్తి-గుంటూరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కోరుతూ ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పిలుపు మేరకు మంగళవారం వివిధ దళిత, ప్రజా సంఘాలు లక్ష పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టాయి. స్థానిక గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల నాయకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ చరిత్రను 6వ తరగతి నుంచి పాఠ్యాంశాల్లో చేర్చాలని, ప్రతి మండలంలో అంబేద్కర్ స్మృతి వనాలు అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అమరావతిని అంబేద్కర్ బౌద్ధ క్షేత్రంగా తీర్చి దిద్దాలని, విజయవాడలో ఉన్న అంబే ద్కర్ స్మృతివనాన్ని ప్రపంచ పర్యా టక కేంద్రంగా అభివృద్ధి చేయా లని, ప్రతి పాఠశాల, ప్రభుత్వ కార్యా లయాల్లో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా చూడా లని నాయకులు కోరారు. కార్యక్ర మంలో వివిధ దళిత, ప్రజా సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, సాధు మాల్యాద్రి, కైలా జయ సుధ, గంట ప్రభుదాస్, వేతలూర్పి నరసింహా రావు, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

రూ .10 లక్షల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : చిత్తు కాగితాలు ఏరుకుంటూ చోరీలకు పాల్పడిన ఇద్దరు మహిళ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి జనార్దనారావు మంగళవారం వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి గుళ్లపల్లి గ్రామానికి చెందిన శీలం రోసమ్మ(24), శీలం మహంకాళమ్మ(28) చిత్తు కాగితాలు ఏరు కుంటూ జీవనం సాగిస్తుంటారు. నవంబరు 7న తెనాలి రామ లింగేశ్వర పేట తోటవారివీధిలో చిత్తు కాగితాలు ఏరుకునేక్రమంలో తాళం వేసిన ఇంటిని గమనించారు. ఇంటి వెనుక ప్రహరీ దూకి తలుపులుకు ఉన్న తాళాలు పగలుకొట్టారు. ఇంటిలోని 4.5 కేజీల వెండి ఆభరణాలు, బీరువాలో దొరికిన 80 గ్రాముల రెండు బంగారపు చైన్లు దొంగిలించి ఎవరికీ అనుమానం రాకుండా ఉడాయించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించిన ఒకటవ పట్టణ పోలీసులు కేసులోని ఇద్దరు మహిళలను తెనాలిలో అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. దొంగిలించిన చోరీ సొత్తు విలువ మార్కెట్లో రూ 10 లక్షలు ఉంటుందన్నారు. కేసును వేగవంతంగా ఛేదించిన ఒకటవ పట్టణ సిఐ వి మల్లిఖార్జున రావు, ఎస్సై వై సుబ్బయ్య, స్టేషన్ సిబ్బందిని డిఎస్పి అభినందించారు. సిబ్బందికి జిల్లా ఎస్పి సతీష్ కుమార్ చేతులమీదుగా పారితోషకం ప్రకటిస్తామన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : మాచర్ల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం పిచ్చయ్య బావి తండాలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పిచ్చయ్యబావి అడివిలో నాటుసారా కాస్తున్నట్లు వచ్చిన సమా చారం మేరకు దాడులు చేశామని సారా తయారికి ఉపయోగించే 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు. నాటు సారా తయారీ చేసినా, ఇతర రాష్ట్రల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్ముతున్న కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్ముతున్నా వారి సమాచారం తెలియపరిచిన యెడల వారి పేర్లు వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

IN THE COURT OF THE HON'BEL PRINCIAL FAMILY COURT JUDGE AT: SECUNDERABAD
I.A.No. 116 OF 2024
IN
F.C.O.P.No. 571 of 2019

BETWEEN:
K.Srikanth ...Petitioner
AND
K.Niharika ...Respondent

To,
K.Niharika W/o.K.Srikanth, R/o. 13-2-261, 13 th Ward, Railway Station Road, Macherla Town, Guntur District, A.P.

Please take notice that the petitioner filed a set-aside petition in the above case and the Hon'ble court ordered to serve notice to you and the matter posted on **27/11/2024**.Please appear on the said date before the Hon'ble court by yourself or through your advocate otherwise the matte will be decided as per law.

Sd/-
K.V.L.Narasimha Murthy
K.V.Malikarjuna Rao
Advocates
K.V. Associates
103, ASHOKA CHAMBERS
ADARSH NAGAR
HYDERABAD-63
Cell: 9848-416979

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్), సత్తెనపల్లి
ఐ.ఎ. 1421/2024 ఓ.యస్. 16/2017

బిట్వీన్ :
గుత్తికొండ మస్తాన్‌రెడ్డి ... పిటీషనర్ / వాది
మరియు
వివరం సుశీలమ్మ అండ్ వగైరాలు ... రెస్పాండెంట్స్ టు,

R5 : పల్లప్రోలు దేశిరెడ్డి, తండ్రి : శ్రీనివాసరెడ్డి, పరస గ్రామం, పెదకూరపాడు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల పిటీషన్‌లో శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 15-11-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడ మైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదాతేది : 15-11-2024

వి.శ్రీలత
పిటీషనర్/వాది తరపు న్యాయవాది,
గుంటూరు.

మహారాజశ్రీ అదనపు సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్), నరసరావుపేట వారి కోర్టులో
Cr.I.P. No. 28/2023

బిట్వీన్ :
ఉప్పలపాటి రామలింగయ్య మరియు 2 ఇతరులు ..... పిటీషనర్లు
వర్సెస్
జమ్ముల పార్వతి మరియు 2 ఇతరులు .... రెస్పాండెంట్స్

To,
R2): జమ్ముల సాయి ప్రవళ్ళిక, భర్త : కొత్తపల్లి చిన్నబాబు, తండ్రి : జమ్ముల ప్రభాకరరావు, నివాసం: డోర్ నెం. 3-40-8/1, 1వ లైన్, ఎన్‌జిఓ కాలనీ, నరసరావుపేట పట్టణం అండ్ మండలం, పల్నాడు జిల్లా.

సదరు పై నెంబరు ఐ.పి. పిటీషన్‌లో మొదటి రెస్పాండెంట్‌ని ఇన్‌సాల్వెంట్‌గా మరియు మొదటి రెస్పాండెంట్, రెండవ రెస్పాండెంట్‌కు రాసిన దఖలు దస్తావేజును రద్దు చేయమని కోరుతూ పిటీషనర్స్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్‌కు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 22-11-2024కి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీ పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొన వలెను, లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడ మైనది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 22-11-2024

చంద్ర ఆంజనేయులు,
దేసు పవన్‌కుమార్,
పిటీషనర్స్ తరపున న్యాయవాదులు,
నరసరావుపేట,
సెల్ : 9441142298

NOTICE
IN THE COURT OF THE FAMILY COURT CUM XII ADDL.DIST JUDGE :: GUNTUR
F.C.O.P (M.D.O.P.)NO.74/ 2023

Between :
Syed Aliya . ... Petitioner
And
Syed Umar ....Respondent

To,
Syed Umar, S/o. Rahamathulla, R/o.C/o. Haleem Baig (Babu), Door No.18-8-9, Old Police Station Road, King Hotel Lane, Lalapet, Guntur, Guntur Dist.

పై నెంబరు F.C.O.Pని పిటీషనరు, రెస్పాండెంట్ తో జరిగిన వివాహమును రద్దు పరచి,విడాకులు ఇప్పించమని కోరుచూ దాఖలు చేయగా సదరు ఒ.పి.లో రెస్పాండెంట్ అయిన మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీకోర్టువారు ది:17-12-2024కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ. గం. 10-30ని.ల.కు మీరు స్వయంగా గాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:17-12-2024

Shaik Nazeera,
Advocate for Petitioner,
Guntur, Cell:90591 76168

IN THE COURT OF HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, NARASARAOPET.
IP.NO:- 20/2022

Between:-
చిలమకూరి వెంకట్రావు ...పిటిషనర్
V/S
సోము నాగేశ్వరరావు మరియు 21 మంది ఇతరులు. ...రెస్పాండెంట్స్.

R15) కజ్జం కోటేశ్వరరావు S/o వెంకటేశ్వరరావు C/o రామచంద్ర ఎలక్ట్రానిక్స్, ఫైనాన్స్ వ్యాపారం, డోర్ నెం: 6-3-275/1 నివాసి, మల్లమ్మ సెంటర్, నరసరావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా

సదరు పై నెం. ఐపి దావాలో పిటిషనర్ తనను ఇన్సాల్వెన్సీగా డిక్లేర్ చేయమని కోరుతూ దాఖలు చేయగా సదరు పిటిషన్‌లో R15 లకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు శ్రీ కోర్టువారు ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 19-11-2024కి వాయిదా వేసి ఉన్నారు.కావున సదరు వాయిదా రోజున ఉదయం 10:30 గం.ని లకు మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది గారి ద్వారా కానీ శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావాను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయ డమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా. ది. 19-11-2024

ఇట్లు.
శ్రీరామినేని ప్రసాద్,
చంద్ర రాజేశ్వరరావు,
పిటిషనర్ తరపు న్యాయవాది, నరసరావుపేట,
Cell.No:- 8341303388, 8106760799.

In the Court of the IInd Additional District Judge, Amalapuram
F.D.I.A. No. 2/2024 in O.S. No. 9/2009

Between:
Nallamilli Ramachandra Reddy (died) and Others ***...Petitioners/ Plaintiffs***
AND
Kotipalli Satyanarayana Murthy ***...Respondent/ Defendant***

To:
Kotipalli Satyanarayana Murthy, S/o. (late) Manikyala Rao, age 78 years, Business, D.No. 3-26-16, Pattabhipuram, Flat No. 304, SKVS Residency, Guntur.

పై నెంబరు F.D.I.A. పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 11-12-2024 సం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల పై F.D.I.A. పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కె.వి.ఎస్.వి.లక్ష్మాజిరావు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9866211196

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చిలకలురిపేట వారి కోర్ట్ లో
ఓ.ఎస్.54/2023

కొండా సోమి రెడ్డి @ శామ్యూల్ రెడ్డి,..... వాది
వర్సెస్
పీట్లోల్ల స్వరూప మరియు ఇతరులు .....ప్రతివాదులు

To: Defendant-2:
తుమ్మలపుడి దుష్మంత రెడ్డి, తండ్రి కోటిరెడ్డి, విజయ అపార్ట్ మెంట్, SVN కాలనీ, 1వ లైన్, గుంటూరు, గుంటూరు జిల్లా.

పై నెంబర్ గల దావాలో మీరు 2వ ప్రతివాది అయియున్నారు. శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారము పై నెంబర్ గల దావాలో శ్రీ కోర్ట్ వారి నుండి ఎన్ని పర్యాయములు సమనులు పంపినను మీరు బుద్ధి పూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారము ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబర్ దావా ది. 28.11.2024వ తేదీన వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదా రోజున మీరు స్వయముగా గానీ, వకీలుగారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబర్ గల దావాలో మీకు గల ఆక్షేపణలను తెలియ పరచవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయటమైనది.

వాయిదా: 28.11.2024

ఇట్లు
పోలూరు పాండురంగరావు
పోలూరు పురుషోత్తమరావు
పిటీషనర్ / వాది తరపున న్యాయవాదులు.

పబ్లిక్ నోటీసు
ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ) రి.నెం. **ABC-CS/006/2015,**
H.O. ABCCS, Endowments Commissionersate Campus, Gollapudi, Vijayawada, Krishna (D), A.P - 521 225, Ph : 0866-6650307
B.O : ABC-CS, # D. No. 12-1-16/A, Beside UBI, Prakash Nagar, Narasaraopet, Palnadu Dist, AP-522601, Ph:08647-231005.

ఈ ప్రకటనలోని వారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తి సొసైటీ నందు తనఖా పెట్టి, అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్తి తనఖాపై సొసైటీవారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖిత పూర్వకంగా వారి అభ్యంతరములను రిజిష్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా మా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
	Mrs. Palaparthi Kalyani W/o Palaparthi Srinivasa Sastry GL No : 75318 Mobile No : 9618631513/ 9652965787	The property an extent of 106.3 Sq. Yards of house site long with RCC roofed ground floor building therein , in RS No-446/A,456/A, old Door no-1-5, new door no. 1-501, Asst No: -501, Near Peda kancherla, Vinukonda mandal, Palnadu District. 522649 Note: Schedule property title covered from 2014 onwards before it is an ancestral. **Value : Rs 7.44 lacs**

Narasaraopet
Dt. 12/11/2024

Sd/- K RAMAKORESWARA RAO
Branch Manager
9281400350/9294450350

పురపాలక సంఘ కార్యాలయము, సత్తెనపల్లి
టెండర్ కమ్ బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఓ.సి.నెం.113/2021/ఎ **తేది. 12-11-2024**

సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో గల. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి ఈ దిగువ తెలిపిన షాపు రూములు నిర్ణయించిన నెలసరి అద్దె పై బహిరంగ వేలమును ది. 26-11-2024న మంగళవారం ఉదయం 11.00 గంటలకు మునిసిపల్ కార్యాలయము నందు మునిసిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.(1) N.T.R. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు 3,6,7,8,9,10,11,12,13,14,18,19, 20,21,22, 23,24,25,26,27, 28,29,30,32,33,34,35,36,37 మరియు 39 (2) శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య కాంప్లెక్స్ నందలి షాపులు: 1,2, 3,4,5,7,8,10,16 మరియు First Floor, Second Floor Open Hall (3) శ్రీ వై.వి. రెడ్డి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపులు 8,14,15,17,18 మరియు B Block (4) శ్రీమతి గంటా సరస్వతి & రోశయ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు రూము నెం.2 ను (5) రాజీవ్ గాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ 3,4,5,17,18,19,27,28,29,30,38,39,40,41 మరియు 42లను సదరు బహిరంగ వేలమునకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవచ్చును

సం/- కొలిమి షమ్మి, కమీషనరు
సత్తెనపల్లి పురపాలక సంఘం.

మహాసభలో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి

కొత్త సీసాలో పాత సారా లాగానే కూటమి ప్రభుత్వ పాలన : సిపిఎం

ప్రజాశక్తి - క్రోసూరు

కొత్త సీసాలో పాత సారా లాగానే కూటమి ప్రభుత్వ పాలన ఉందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి విమర్శించారు. సిపిఎం క్రోసూరు మండల మహాసభ దొడ్లేరులోని షాదిఖానాలో ఎం.పౌలు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సిపిఎం జెండాను సీనియర్ నాయకులు యు.వెంకటేశ్వర్లు ఎగురవేయగా, సీతారాం ఏచూరి చిత్రపటానికి ఎ.బాలయ్య, ఎ.ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగు నీరు అందించాలని, లోకేష్ హామీ ప్రకారం పులిచింతల బ్యాక్ వాటర్ బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో పోయడానికి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, క్రోసూరులో ప్రజా మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని, రెవెన్యూ ఫారెస్ట్ సరిహద్దుల్లో పేదలకు పట్టాలిచ్చిన భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని 15 స్థానిక సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.హనుమంతరావు, సభ్యులుగా సిహెచ్.యేసయ్య, ఏపూరి వెంకటేశ్వర్లు, సయ్యద్ హుస్సేన్, జి.మధుసూదన్‌రావు, ఆర్.వెంకటేశ్వర్లు, జి.ఎలిశమ్మ ఎన్నికయ్యారు. డి.నటరాజ్, టి.చుక్కయ్య, కె.గోపికృష్ణారెడ్డి, జి.రవికుమార్, జె.పేతురు, టి.కుమారి, ఎన్.సరస్వతి, కె.అనూష, జి.సురేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

పట్టభద్రుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తులను ఆన్లైన్ చేయాలని అధికారులను ఆర్డీవో జీవి రమాకాంతరెడ్డి ఆదేశించారు. దరఖాస్తులను స్థానిక తహశీల్దార్ కార్లాయంలో మంగళవారం పరిశీలించిన ఆయన ఆన్‌లైన్ చేసిన వాటి వివరాలపై తహశీల్దార్ చక్రవర్తిని వివరాలు అడిగారు. మండలంలో మొత్తం 2636 దరఖాస్తులు రాగా ఆన్లైన్‌లో 2005, ఆఫ్ లైన్లో 621 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. ఆఫ్‌లైన్లో వచ్చిన దరఖాస్తులను బుధవారం సాయంత్రం కల్లా ఆన్‌లైన్ చేయాలని ఆర్‌డివో చెప్పారు.

విద్యుత్ అనధికారి వినియోగంపై జరిమానా

ప్రజాశక్తి - యడ్లపాడు

విద్యుత్ శాఖ ఎస్‌ఇ పి.సుబ్రహ్మణ్యం నేతృత్వంలో మండలంలోని 16 గ్రామాల్లో అధికారులు, సిబ్బంది మంగళవారం 32 బృందాలుగా ఏర్పడి విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారు. అనధికారికంగా అధికలోడు విద్యుత్ వినియోగిస్తున్న 51 సర్వీసులకు రూ.1,94,300 జరిమానా విధించారు. విద్యుత్ కనెక్షన్ లేకుండా కరెంటును వాడుకుంటున్న ఇద్దరికి రూ.3 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో గుంటూరు టౌన్-2 ఇఇ సిహెచ్.రమేష్, డిపిఇ-విజిలెన్స్ ఇఇ సిహెచ్.వెంకటేశ్వరరావు, డిఇలు గురునాథరావు, ఆర్.అశోక్ కుమార్, ఇఎ బి.జెస్సి జయకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం 14న సిపిఎం ధర్నాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ చేపట్టిన ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా పట్టణంలోని రంగా కాలనీ, సుందరయ్య కాలనీ, 19వ వార్డు, మాష్టిన్‌పేట, కొత్తపేటలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎ.వీరబ్రహ్మం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక ధరలు పెరుగుదలతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం 14న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జి.సుసులోవ్, పి.ప్రభాకర్, బి.నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణ్‌రావు, జె.రాజకుమార్, ఎం.తాతారావు, ఎ.రామయ్య, పి.కాళీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మాచవరం మండలంలో ప్రచారంలో భాగంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. మాచవరం, పిడుగురాళ్ల మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.18 వేల కోట్ల విద్యుత్ అదనపు చార్జీల పేరుతో భారం మోపుతోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక లేక పనులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్, ఎలిసెట్టి బ్రహ్మానాయుడు, షేక్ జాఫర్, సత్యనారాయణ, సాయి, సైదా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదలలో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు జి.జాలయ్య, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, డి.చెన్నారావు మాట్లాడారు. 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడారు. 18 రకాల నిత్యావసర వస్తువులను ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందజేయాలని, మహిళలు, చిన్నపిల్లలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న కలెక్టరేట్, మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.నాగేశ్వరరావు, ఎం.ప్రకాష్‌రావు, బి.మరియదాసు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

స్కానింగ్ బయటకు రాస్తున్నారు..

ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన సిపిఎం బృందంతో రోగుల ఆవేదన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మెరుగైన వైద్యం అందించడంతోపాటు అన్ని రకాల మందులు ఇవ్వాలని, అన్ని రకాల వైద్య పరీక్షలు ఆసుపత్రిలోనే చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని సిపిఎం పట్టణ కమిటీ బృందం మంగళవారం సందర్శించింది. రోగులు మాట్లాడి సదుపాయాలపై అడిగారు. స్కానింగ్ బయటకు రాస్తున్నారని, రూ.1100 ఖర్చవుతోందని, అంతమొత్తాన్ని ఎలా భరించగలమని పలువురు వాపోయారు. బాలింతల డిశ్చార్జి సందర్భంలో గతంలో ఇచ్చిన కిట్లను ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో నాయకులు మాట్లాడగా ఆయన స్పందిస్తూ ఆసుపత్రిలో 75 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. థైరాయిడ్, టిఫా వంటి పరీక్షలకు సంబంధించిన మిషన్లు అందుబాటులో లేకపోవడం, రేడియాలజీ స్కానింగ్ మిషన్ ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేకపోవడంతో గుంటూరు జిజిహెచ్‌కు సిఫార్సు చేస్తున్నామని చెప్పారు. వైద్యులు బయట ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుని ఆ ఖర్చును బిల్లులు పెట్టి ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు వచ్చేలా చేస్తున్నామని తెలిపారు. ప్రసూతి కిట్లను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వారికి ఇచ్చే పారితోషకం రూ.5 వేలను ఆరోగ్యశ్రీ ద్వారా వారి ఖాతాలకు జమవుతున్నారు.

న్యూమోనియా బాధిత పిల్లల గుర్తింపు కోసం సర్వే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి

న్యూమోనియాతో బాధపడే ఐదేళ్లలోపు వారిని గుర్తించి సత్వర చికిత్స చేయించేందుకు జిల్లా వ్యాప్తంగా బుధవారం నుండి 28వ తేదీ వరకూ ఎస్ఎఎన్ సర్వే నిర్వహిస్తామని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ఏరియా హాస్పిటల్ ప్రసూతి వార్డులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లల్లో మరణాలకు ఎక్కువగా నిమోనియా కారణమన్నారు. నిమోనియా వ్యాధికి ప్రధానంగా బ్యాక్టీరియా లేదా వైరస్ కారణం కావచ్చని, ఇది సాధారణ జలుబుతో ప్రారంభమై నిమోనియాగా మారవచ్చని చెప్పారు. ఏ బిడ్డ అయినా త్వరత్వరగా శ్వాస తీసుకోవడం, పక్కటెముకలు ఎగురవేయడంతో పాటు అధిక జ్వరం ఉంటే నిమోనియాగా భావించి దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. ధూమపానం చేసేవారు తమ దగ్గర్లో పిల్లలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు నిధుల కరువు

మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజల ఆశలను కూటమి ప్రభుత్వం అడియాసలు చేసిందని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బడ్జెట్లో సూపర్ సిక్స్ హామీలకు నిధులు కరువయ్యాయని, తల్లికి వందనం రూ.12450 కోట్లు ఇవ్వాల్సి ఉండగా రూ.6487 కోట్లు మాత్రమే కేటాయించారని, అన్నదాత సుఖీభవకు రూ.10,700 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం వాటా రూ.3500 కోట్లతో కలిపి రూ.4500 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. మహిళా నిధికి రూ.37,300 కోట్లు అవసరం కాగా రూ.3341 కోట్లు, దీపం పథకంలో 1.42 కోట్ల మంది అర్హులు ఉండగా రూ.95 లక్షల మందికే కేటాయింపులు ఉన్నాయని చెప్పారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 20 లక్షల మందికి ఉపాధి కల్పన ఊసే లేదన్నారు. సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పగా ఏప్రిల్ నుండి జీఎస్టీ వసూళ్లు క్రమంగా తగ్గాయన్నారు. ఇసుక లేకపోవడం, రిజిస్ట్రేషన్లు తగ్గిపోవటంతో జిఎస్టి వసూళ్ళు తగ్గాయన్నారు. రూ.18 వేల కోట్ల విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మద్యం లైసెన్స్ పొందిన వారు బెల్టు షాపులు నిర్వహించరాదని, మద్యాన్ని ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుండి నాన్ డ్యూటీ పైడ్ లిక్కర్ రాష్ట్రంలోకి సరిహద్దుల్లోకి రాకూడదని, మాచర్ల, బొల్లాపల్లి, నరసరావుపేట గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడా ఉన్న నాటుసారా తయారీని పూర్తిగా నిర్మూలిస్తామని అన్నారు. లైసెన్స్‌దారులు బెల్ట్ షాపులు నిర్వహిస్తే మొదటిసారి రూ.5 లక్షల అపరాధ రుసం, షాపు సస్పెండ్ చేస్తామని, రెండోసారి కూడా పట్టుబడితే లైసెన్స్‌ను పూర్తిగా రద్దు చేస్తామని చెప్పారు. ఎమ్మార్పీ ధరకు ఒక్క రూపాయి అధికంగా అమ్మినా మొదటి తప్పు కింద రూ.5 లక్షలు అపరాధ రుసుం, షాపును సస్పెండ్ చేస్తామని, రెండోసారి పట్టుబడితే షాపు రద్దు చేసి కొత్తవారికి లాటరీ పద్ధతిలో కేటాయిస్తామని అన్నారు. సమావేశంలో ఇఎస్ కె.మణికంఠ, సిఐ పి.సోమయ్య పాల్గొన్నారు.

తాడేపల్లి మండలం కొలనుకొండ, కుంచనపల్లి ప్రజాపోరు ప్రచారంలో డి వెంకటరెడ్డి తదితరులు

మంగళగిరిలో ప్రజాపోరు ప్రచారంలో పాల్గొన్న జెవి రాఘవులు, చంగయ్య తదితరులు

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం : సిపిఎం

ప్రజాశక్తి మంగళగిరి : రాష్ట్రంలో పరిపాలన చేసిన గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నాయని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. మంగళవారం మంగళగిరి పట్టణంలో న్యూ ఇండియా హోటల్ సెంటర్లో పట్నంలో రెండు రోజుల పాటు జరిగే ప్రజా పోరు ప్రచార యాత్రను ప్రారంభించి ప్రసంగించారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసిందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు జరిపే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయడం లేదని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ బారాల మోపుతుందని విమర్శించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మంగళగిరి పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేద ప్రజలు అనేక ప్రాంతాలలో ఇల్లు వేసుకొని నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి మంత్రి నారా లోకేష్ వాగ్దానం చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేస్తామని చెప్పి ఇంతవరకు ప్రణాళిక విడుదల చేయలేదని అన్నారు. ప్రజలను మోసం చేసే దానిలో రెండు పార్టీలు ఒకటేనని అన్నారు. ఇప్పటికైనా ప్రజల గ్రహించి పాలకులు చేసే మోసాలపై ఆలోచించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఈనెల 14వ తేదీన మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ప్రజా పోరు యాత్ర రత్నాల చెరువు, పాత మంగళగిరి, భార్గవ్ పేట, గోపాలకృష్ణ సెంటర్, పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద రేపటి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పెరుగుతున్న అధిక ధరలను నియంత్రయించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఎంటి ఎంసీ పరిధిలోని కొలనుకొండ ఆక్సా నగర్ ప్రాంతంలో సిపిఎం శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తత ప్రచారాన్ని నిర్వహించారు. రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తత ప్రచారాన్ని సిపిఎం శ్రేణులు నిర్వహించారు. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న డి వెంకటరెడ్డి మాట్లాడారు. తాడేపల్లి మండలంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 14వ తేదీన జరుగు ప్రజా పోరును జయప్రదం చేయాలని పిలుపిచ్చారు.కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల వాగ్దానంలో అనేక హామీలు గుప్పించిందని అన్నారు. అందులో భాగంగానే నిత్యవసర వస్తువులు తగ్గిస్తామని, విద్యుత్ బిల్లులు పెంచబోమని ఆనాడు చెప్పి, ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ధరలను అదుపు చేయలేదని ఆయన దుయ్యబట్టారు. అదేవిధంగా ట్రూ అప్ చార్జీల పేరుతో గతంలో వినియోగదారులు వాడుకున్న విద్యుత్ వాడకానికి ఇప్పుడు విద్యుత్ వారాలు ప్రజలపై వేయడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. అంతేకాకుండా కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మతోన్మాద బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించే విధంగా పరిపాలన చేస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల వాగ్దానంలో తెలుగుదేశం ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి, ప్రజలను మభ్యపెట్టిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సాధించకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు నరేంద్ర మోడీకి తొత్తులుగా మారారని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్సులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, బడుగు వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి సుబ్బారావు, సాంబయ్య, మండల నాయకులు పల్లెకృష్ణ, గబ్బర్ ముస్లిమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : సామాన్య ప్రజలపై పడుతున్న అదనపు భారాలను తగ్గించాలని కోరుతూ మంగళవారం తెనాలి సిపిఎం ఆధ్వర్యంలో 5వ రోజు ప్రజాపోరు ప్రచారం నిర్వహించారు. సిపిఎం కేంద్ర కమిటి పిలుపు మేరకు తెనాలి సుందరయ్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. నిత్యా వసరాలు ధరలు తగ్గించాలని ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

తెనాలిలో ప్రజాపోరు ప్రచారంలో సిపిఎం నాయకులు

కార్య క్రమంలో తెనాలి ప్రాంతీయ కమిటి కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్, పార్టి సీనియర్ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, కె రవి కుమార్, ఎన్ రాజ్య లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా పెంచిన నిత్యావసర సరుకులు ధరలను దించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్ రావు కోరారు. ప్రజా పోరు ప్రచారంలో భాగంగా మంగళవారం సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ ఓ సినీ కవి రాసిన ట్లు ఏం కొనేటట్లు లేదు, ఏం తినేటట్లు లేదు అనే పాట ప్రస్తుత పాలకుల విధానాల వల్ల కనబడుతుంది అన్నారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ఆమె మేరకు ఎక్కడ నివాసం ఉంటున్న పేదలకు అక్కడే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వటంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈనెల 14వ తేదీ తాడేపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని తరలిరావాలని స్థానికులను కోరారు. నాసరయ్య ర్యాంపు ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఉష, వెంకటరావు, శాంత కుమారి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్రజాపోరు ప్రచారంలో కరుణాకర్ తదితరులు

ఆర్టీసీ సిటీ సర్వీసులు నడపాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసి గుంటూరు2 డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన డయల్ యువర్ డి.యం కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.కె. అబ్దుల్ సలాం ప్రజల నుండి ఫోన్ ద్వారా అర్జీలు స్వీకరించారు. గోరంట్లకు చెందిన యం.రవీంద్రబాబు సీనియర్ సిటిజన్ పాసులపై అమౌంట్ సరిగా రావట్లేదని, యన్టిఆర్ బస్‌స్టేషన్ ఎదురుగా ఆటోలు ఎక్కువ అపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, గుంటూరు నగరంలో సిటీబస్ సర్విస్‌లు నడపాలని కోరారు. మంగళగిరి, విప్పటంకు చెందిన శ్రీనివాసులు విజయవాడ నుండి వద్దేశ్వరం, విప్పటం, కెఎల్ యూనివర్సిటీ మీదుగా మంగళగిరికి బస్‌సర్విస్ నడపాలని, డొందపాడుకు చెందిన రూపేష్ తుళ్ళూరు సర్విస్‌ను దొండపాడు వరకు నడపాలని కోరారు. గుంటూరుకు చెందిన చంద్ర శేఖర్ గుంటూరు నుండి తుళ్ళూరు, హైకోర్టు, సెక్రటేరియట్ బస్‌లలో సిఆర్‌డిఎ పాస్‌లను అనుమతించాలని, పాత గుంటూరుకు చెందిన కిషోర్ గుంటూరు నుండి హైదరాబాద్, విశాఖపట్నంకు ఏసీ స్లీపర్ బస్‌లు నడపాలని కోరారు.నంబూరుకు చెందిన అంజి గుంటూరు నుండి నంబూరుకు బస్ సౌకర్యం కల్పించాలని, పాత గుంటూరుకు చెందిన పరమేశ్వరరావు ఎన్‌టిఆర్ బస్ స్టేషన్ నుండి బయటకు వచ్చే బస్సులు రైతుబజార్, ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఆపుట వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నదని తెలియచేశారు.

ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిపో మేనేజర్ అబ్దుల్ సలాం

గ్రేడ్-3 ఎఎన్‌ఎంలకు ఇతర పనులు అప్పగించొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

ఏఎన్‌ఎం గ్రేడ్-3 ఉద్యోగులకు వారి జాబ్ చార్ట్‌తో సంబంధం లేని విధులు కేటాయించొద్దని ఎపి హంస అసోసియేషన్ నాయకులు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.నాగవర్ధన్ మాట్లాడుతూ గ్రేడ్ 3 ఏఎన్‌ఎంలను వారి అసలు విధులకు ఆటంకం కలిగేలా ఇతర విధులు కేటాయిస్తున్నారన్నారు. ఇటీవల అసోసియేషన్ కోరిక మేరకు వారికి ఇతర పనులు అప్పగించొద్దని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఉత్తర్వులు ఇచ్చారని తెలియజేస్తూ సదరు ఉత్తర్వుల కాపీని డిఎంహెచ్ఒకు అందచేశారు. కావున ఆ ఉత్తర్వులను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని కోరారు. అలాగే ఏఎన్ఎం గ్రేడ్-3లను ఇతర సర్వేలకు వాడవద్దని ఉత్తర్వులు ఇచ్చినందుకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బల్లకట్టు, పడవలకు టెండర్లు ఖరారు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి : నదీ పరివాహక ప్రాంతంలో జిల్లా పరిషత్ అధీనంలోని రేవులకు పడవలు, బల్లకట్టు నడుపుకొనుటకు రేవు పాటలకు వేలంను మంగళవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈవో ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. చామర్రు పడవ నడుపుకొనేందుకు జి.రామయ్య అనే పాటదారుడికి రూ.2.12 లక్షలకు ఖరారు చేశారు. పడవలకు సంబంధించి చింతపల్లి 'సిహెచ్ రమేష్‌బాబు రూ.56 వేలు, గింజుపల్లి కె.వసంతరావు రూ.3.50 లక్షలు, తాడువాయి సిహెచ్ రమేష్ రూ.7 లక్షలు, మాదిపాడు టి.సతీష్ కుమార్ రూ.11.20 లక్షలు, దిడుగు ఎం.చంద్రశేఖర్ రూ.2.88, ధరణి కోట కె.గోవింద్ రూ.76 వేలు, వల్లభాపురం పడవకు ఎవ్వరూ రానందున పాట వాయిదావేశారు. అలాగే బల్ల కట్టు కు సంబంధించి మాదిపాడు అబ్దుల్ సత్తార్ రూ.4.27లక్షలు, గోవిందాపురం బి.వెంకటేశ్వర్లు రూ.3.45లక్షలకు టెండర్లు ఖరారు చేశామని జిల్లా పరిషత్ అధికారులు తెలిపారు.

జిఎస్‌టిలో టాక్స్ కన్సల్టెంట్‌ల పాత్ర కీలకం

జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ బి.లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జి.ఎస్.టి శాఖలో టాక్స్ కన్సల్టెంట్‌ల పాత్ర ఎంతో కీలకమైనదని సెంట్రల్ జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ బి.లక్ష్మి నారాయణ అన్నారు. మంగళవారం కన్నావారితోట ఐదవ లైన్ లో 'ఈజీ టాక్స్' పేరుతో నూతనంగా ప్రారంభించిన టాక్స్ కన్సల్టెన్సీ సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దీనికి జి.ఎస్.టి రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్, ఈజీ టాక్స్ నిర్వాహకుడు చుక్కా విల్సన్ బాబు అధ్యక్షత వహించారు. జాయింట్ కమిషనర్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ జి.ఎస్.టి చెల్లింపుదారులు తెలిసి తెలియక ఎన్నో తప్పులు చేస్తున్నారని, వాటిని సరిదిద్దటానికి టాక్స్ కన్సల్టెంట్లు ఎంతో అవసరమన్నారు. పన్ను చట్టాల నిబంధనలు తరచూ మార్పులకు లోబడి వుంటుందని, వాటిని అర్ధం చేసుకొని అప్డేట్ చేయడం కాన్సల్టెంట్లకే సాధ్యమన్నారు. జి.ఎస్.టి వచ్చి ఏడున్నర ఏళ్లు గడచినప్పటికి ట్రేడ్‌లో ఇంకా పలు సందేహాలు వ్యక్తమవుతూనే ఉన్నాయన్నారు. సలహాలు, సందేహాల నివృత్తికి ఇలాంటి సేవా సంస్థలు మరిన్ని రావాలని ఆకాక్షించారు. జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్ వి.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన నిష్టాతులైన అధికారులు ఇలాంటి సంస్థ నెలకొల్పడం అభినందనీయమన్నారు. జీఎస్టీ నిఘా విభాగం అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, రవికుమార్ మాట్లాడుతూ టాక్స్ కన్సల్టెంట్ల మద్దతు, సహాయ సహకారాలు లేకుండా, పన్ను చెల్లింపుదారుల్లో జీఎస్టీ పై అవగాహన పెంచడం సాధ్యం కాదని పేర్కొన్నారు. రిటైర్డు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు రాజేశ్వరరావు, వివేకానంద మాట్లాడుతూ జీఎస్టీ రిజిస్ట్రేషన్ మొదలుకొని రిటర్న్లు,రిఫండ్లు,షోకాజ్ నోటీసు జవాబులు, ఆడిట్ జవాబులు, ఎగుమతి దిగుమతులు, అప్పీల్, ట్రిబ్యునల్, కోర్టులకు వెళ్ళంత వరకు కన్సల్టెన్సీ సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. క్రెడయి ఎ.పి ఛైర్మన్ ఆళ్ళ శివారెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ విషయంలో ఐ.టి ఆడిటర్లు ఎంతో వెనుకబడివున్న తరుణంలో, కోస్తాలో తొలిసారిగా జీఎస్టీ కన్సల్టెన్సీ సర్వీస్ ను అంద ుబాటులోకి తేవడం పన్ను వర్గాలకు గొప్ప సదవకాశమన్నారు. ఈజీ టాక్స్ వ్యవస్థాపకుడు చుక్కా విల్సన్ బాబు తదితరులు మాట్లాడారు.

వీల్‌ఛైర్‌లు అందచేస్తున్న రామచంద్రరాజు, తదితరులు

జ్వరాల ఆసుపత్రికి రెడ్‌క్రాస్ వీల్‌ఛైర్లు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ జ్వరముల ఆసుపత్రికి రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆసుపత్రి రోగుల కోసం మూడు వీల్ ఛైర్‌లను రెడ్‌క్రాస్ జిల్లా వైస్ ఛైర్మన్ పి.రామచంద్రరాజు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘుకి అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాక్టర్ రఘు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలను కొనియాడారు. ప్రకృతి విపత్తులు, కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ వాలంటీర్ల సేవలు అమూల్యమైనవని అన్నారు. రామచంద్రరాజు మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సేవలు అందచేయనున్నట్లు తెలిపారు.

మరింత బాధ్యతగా బడిలో మరో గంట ఉందాం

ఉపాధ్యాయులకు యుటిఎఫ్ పిలుపు - ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్

మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సంస్కరణల పేరిట గత ప్రభుత్వాలు అమలుపరిచిన అస్తవ్యస్త విధానాలను సరిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకోవాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు అధ్యక్షతన ఈపూరు, నూజెండ్ల యుటిఎఫ్ మండల శాఖ మహాసభలు మంగళవారం నిర్వహించారు. పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలలో స్వర్ణోత్సవ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ పోరాడుతోందని, ఉపాధ్యాయులకు మెరుగైన జీతాలు సాధించి సమాజంలో గౌరవాన్ని నిలబెట్టేలా కృషి చేసిందని చెప్పారు. సామాజిక స్పృహతో ప్రజలు ఇబ్బందులు పడిన ప్రతి సందర్భంలో తగు విరాళాలతో సహాయపడ్డామన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతం కోసం ఎనలేని కృషి చేశామన్నారు. కానీ ప్రభుత్వాలు విద్యారంగ బాధ్యతల నుండి తప్పుకుంటూ విద్యారంగం మొత్తాన్ని కార్పొరేట్ రంగానికి ప్రైవేటు రంగానికి అప్పజెప్పే దిశలో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా ఆన్లైన్‌వర్క్ తో యాప్‌ల భారంతో ఇబ్బంది పెడుతోందన్నారు. జీవో 117 ద్వారా ఉపాధ్యాయులను తగ్గించే ప్రయత్నం జరిగిందని, ఈ జీవోను రద్దు చేసి పాఠశాలలను కొనసాగిస్తామనడం శుభ పరిణామమని చెప్పారు. మూడు,నాలుగు, ఐదు తరగతుల విలీనం రద్దుచేసి మోడల్ ప్రాథమిక పాఠశాల ఒకటి నుండి ఐదు తరగతులతో ఐదుగురు ఉపాధ్యాయులతో నెలకొల్పాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అదనంగా ఒక గంట సేపు పాఠశాలలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

ఈపూరు, నూజెండ్ల మండలాల నూతన కమిటీలు ఎన్నిక

ఈ సందర్భంగా ఈపూరు, నూజెండ్ల మండల శాఖల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు, టి.వెంకటేశ్వర్లు వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి ఆర్.అజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.పోలయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు పి.ఎ.జిలాని, రామిరెడ్డి, మల్లికార్జున, నాగేశ్వరరావు, వీరాంజనేయులు, మస్తాన్, గోవింద్ నాయక్, రాము నాయక్, భాస్కర్, తిరుపతిరెడ్డి, రమేష్‌బాబు, రామారావు, సీనియర్ నాయకులు జి.నాగేంద్రుడు, వెంకటరెడ్డి, రవికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

నూజెండ్ల మండల కమిటీ : గౌరవాధ్యక్షులుగా డి.కోటేశ్వరరావు, అధ్యక్షులుగా అనుపోజు సోమ సూర్య ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ మల్లికార్జునరావు, సహాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, మహిళా సహాధ్యక్షులుగా ఎ.జ్యోతి, కోశాధికారిగా వై.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

ఈపూరు మండల కమిటీ : గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాసమూర్తి, అధ్యక్షులుగా వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.జ్యోతిష్, సహాధ్యక్షులుగా వై.రాజ్ కుమార్, జి.సునంద, కోశాధికారిగా వై.ఎల్. ఖాసిం సైదులు ఎన్నికయ్యారు.

ఆదాయం ఇస్తున్నా అవస్థలే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వర్షం పడితే స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కూర్చోవటానికి అవకాశం లేదు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారికి కార్యాలయంలో కనీసం కుర్చీలు కరువయ్యాయి. దీనికితోడు మంగళవారం వర్షం రావడంతో పలువురు వెనుదిరిగి వెళ్లిపోయారు. బయట షెడ్లు, టీ దుకాణాల్లో రాత్రి 7 గంటల వరకూ నిరీక్షించారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తున్నా తమకు ఈ అవస్థలేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సదుపాయంతోపాటు కూర్చోవడానికి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుని కోసం కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని రెంటాలకు చెందిన కొత్త అఖిల్ అదృశ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం నుంచి కనిపించక పోవడంతో పాటు సెల్ ఫోను స్విచ్ ఆఫ్ చేసి ఉండడం, చెప్పులు, సెల్ ఫోన్ బుగ్గ వాగు రిజర్వాయువు ఒడ్డున లభ్యం కావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. మంగళవారం వేకుజామున నుంచే వందలాదిమంది రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. మత్స్యకారులను రంగంలోకి దించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గాలింపునకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. బీటెక్ పూర్తి చేసిన అఖిల్ కొంతకాలం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి ఖాళీగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

పంచాయతీల ఆర్థిక ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - నూజెండ్ల

పంచాయతీ ప్రణాళిక (జిపిడిపి 2024-25) తయారీపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎం.జయరామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం శిక్షణిచ్చారు. ఎంపిడిఒ పి.ఉమాదేవి మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులపై సమగ్ర పరిశీలన చేసి నిధులు అవసరం, ఇతర అంశాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, గతంలో ఆగిపోయిన ప్రస్తుతం అవసరమైన పనులపై గ్రామస్థాయిలో సమీక్షించి సమగ్ర నివేదికను మండల కార్యాలయానికి అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్‌కు గంగినేని ఫౌండేషన్ సహకారం

ప్రజాశక్తి - నూజెండ్ల

స్థానిక జెడ్‌పి పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పాడవగా మరమ్మతులను గురవగా గంగినేని ఫౌండేషన్, పూర్వ విద్యార్థుల సంఘం ఆర్థిక సహకారంతో మంగళవారం పూర్తి చేయించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ మాట్లాడుతూ పదో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ కిట్ త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. హాజరులో ఉత్తమంగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధి గంగినేని రాధాకృష్ణమూర్తి, ఎస్ఎంసి ఛైర్మన్ ముప్పాళ్ళ శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు కోసం 3,204 దఖాస్తులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటు హక్కు కోసం మాచర్ల పట్టణం పరిధిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 3,204 దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు మంగళవారం తెలిపారు. బూత్ లెవల్ అధికారులు వీటిపై విచారణ చేసి సహాయ నమోదు అధికార్లకు సిఫార్సు చేస్తారని, బిఎల్‌ఓలు అడిగిన పత్రాలను దరఖాస్తుదారులు ఇచ్చి సహకరించాలని కమిషనర్ కోరారు.

రేపటి నుండి సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

71వ అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. 14న సహకార మంత్రిత్వ శాఖ యొక్క కొత్త కార్యక్రమాల ద్వారా బలోపేతం చేయుట, 15న సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించుట, 19న మహిళలు, యువత బలహీన వర్గాల కొరకు సహకార సంఘాలు కార్యక్రమాలు, 20న సుస్థిర అభివద్ధి లక్ష్యసాధనలో మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర వంటి తదితర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డిసిఒ వెంకట రమణ, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి నాగశ్రీనివాస్, జిల్లా కో-పరేటివ్ ఆడిట్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కార్తిక్ పాల్గొన్నారు.

మాచర్లలో చైల్డ్ యాక్ట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

బాలికల సమస్యలపై వాట్సాప్ గ్రూప్

ప్రజాశక్తి- వెల్దుర్తి

బేటీ బచావో, బేటీ పడావోలో భాగంగా బాలికల హక్కుల పరిరక్షణ అవగాహన సదస్సు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎంపిడిఒ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామాల్లో సర్వేలు చేసి చదువుకు దూరంగా ఉన్న బాలికలను గుర్తించి వెంటనే బడికి పంపించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలతో నష్టాలపై గ్రామీణులను చైతన్య పరచాలన్నారు. పోక్సో యాక్టు గురించి వివరించాలన్నారు. ప్రతి బాలిక చదువుకునేలా, లింగ వివక్షను తొలగించటానికి అందరం కలిసి కృషి చేద్దామన్నారు. అధికారులందరూ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని బాలికల సమస్యలపై ఎప్పటికప్పుడు గ్రూపులో షేర్ చేస్తూ ఉండాలన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 ప్రతి సచివాలయంలో అందరికీ కనబడేలా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బందితో కలిసి చైల్డ్ యాక్ట్ కరపత్రాలను విడుదల చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దుర్గ, ఎఎన్ఎంలు, పంచాయితీ కార్యదర్శిలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి మాట్లాడారు. ఎంపిపి పి.కోటయ్య, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎంఇఒ గణేష్ పాల్గొన్నారు. కస్తూరిబా పాఠశాలలో ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

తండాలకు నిధుల కోసం మంత్రితో ఎమ్మెల్యే జీవీ సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని ఎస్టీ కాలనీలు, తండాల్లో సమస్యలు పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ద్వారా కూడా తమ నియోజవర్గం పరిధిలోని వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రహదార్లు, తాగునీరు, గృహ నిర్మాణం, విద్యుత్, మహిళా సాధికారిత, స్వయం ఉపాధి తదితరాంశాల్లో చొరవ చూపాలని కోరారు. గ్రామ పంచాయతీలకు సాధారణంగా కేటాయిస్తున్న నిధులకు తోడు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

372 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక టీచర్స్ కాలనీలోని షేక్ సైదులు, బాష నూతన భవనంలో నర్సరావుపేట డాక్టర్ ఎంవి రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని గీతం స్కూల్ డైరెక్టర్ కర్లకుంట రమేష్ మంగళవారం ప్రారంభించారు. 372 మందికి కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. డాక్టర్ ఎంవి రెడ్డి మాట్లాడుతూ టీవీలు, మొబైల్స్, పెద్ద పెద్ద స్క్రీన్లు ఉపయోగించడం వలన కంటి సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. పిల్లల వద్ద నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆకుకూరలు, క్యారెట్ లాంటివి తీసుకోవాలన్నారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : పిఎంఎవై క్రింద మంజూరు అయిన ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మార్చి తర్వాత కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రావని, స్టేట్ బడ్జెట్ నుండే ఖర్చు పెట్టాల్సి వుంటుందని, కావున లబ్దిదారులు, కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం పేరేచర్లలోని ఇళ్ల లేఅవుట్‌ను, యంఎస్‌యంఈ క్రింద నెలకొల్పిన యూనిట్‌ను, మేడికొండూరు జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పేరేచర్ల లేఅవుట్‌లో పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లు ఆప్షన్ 3 ప్రకారం ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావట్లేదన్నారు. అప్రోచ్ రోడ్లు , నిర్మాణాలకు నీరు, గ్రావెల్ అవసరం అని ఎమినిటీ సెక్రెటరీలు కలెక్టర్‌కు తెలిపారు. మెటీరియల్ రేటు పెరిగిందని, కావాల్సిన మెటీరియల్‌ను క్రషర్స్, క్వారీ యాజమానులతో మాట్లాడి తక్కువ రేటుకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖను , హౌసింగ్ ఆర్‌డిఓకు సూచించారు. లే అవుట్‌లో వీధి లైట్లు లేవని , ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ కండక్టర్ దొంగిలించబడిందని, కేసు నమోదు చేయడం జరిగిందని ఎలక్ట్రికల్ డిఈ కలెక్టర్‌కు తెలిపారు. లే అవుట్‌లో రాత్రి వెళ్లలో గ్రావెల్, ఇసుక దొంగిలిస్తున్నారని , పోలీస్ పహారా ఏర్పాటు చేయాలని లే అవుట్‌లో నివసిస్తున్న వారు కలెక్టర్‌ను కోరారు. రాత్రి పూట పోలీసు గస్తీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం పేరేచర్లలో యంఎస్ యంఇ క్రింద పైలేట్ ప్రాజెక్టుగా రూ.5.50 లక్షలతో ఏర్పాటు చేసిన శ్రీ విజయలక్ష్మి లఫ్యాన్సీ అండ్ బుక్ స్టోర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. తర్వాత

కలెక్టర్‌కు మధ్యాహ్నభోజనం రుచి చూపిస్తున్న జడ్‌పిహెచ్ విద్యార్థులు

మేడికొండూరు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కే.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎలక్ట్రికల్ డిఇ చల్లా రమేష్ , సివిల్ సప్లయిస్ డిడి దేవరాజ్ , డిఇఓ సి. వి. రేణుక, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేశు, డీఆర్డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మీ , మేడికొండూరు తహశీల్దార్ కళ్యాణి , యంపీడిఓ చందన తదితరులు పాల్గొన్నారు.

నదీపరివాహక గ్రామస్తులకు మాత్రమే ఉచిత ఇసుక

ప్రజాశక్తి - కొల్లిపర

నదీ పరివాహక ప్రాంతాల గ్రామస్తులు మాత్రమే వారి సొంత అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక రవాణాకు ప్రభుత్వము అనుమతి ఇచ్చిందని శాండ్ కమిటీ అధ్యక్షులు తహశీల్దార్ సిద్ధార్థ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో శాండ్ కమిటీ సమావేశంలో సిద్ధార్థ మాట్లాడుతూ కొల్లిపర మండల పరిధిలోని కృష్ణా పరివాహ ప్రాంతాలైన అత్తలూరు వారి పాలెం, వల్లభాపురం, మున్నంగి పిడపర్తి పాలెం, కొల్లిపర, హనుమాన్ పాలెం గ్రామస్తులు మాత్రమే ఉచిత ఇసుక రవాణా చేసుకోవచ్చని తెలిపారు. ఉచిత ఇసుక కావలసినవారు ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన వెబ్‌సైట్ ద్వారా కానీ, సచివాలయం ద్వారా తమ వ్యక్తిగత వివరాలతో పాటు నిర్మాణ వివరాలు నమోదు చేసి రసీదు పొందాలన్నారు. అంతేకాక ట్రాక్టర్‌కి ఉచిత ఇసుక రవాణా అనే బ్యానర్ కట్టాలన్నారు. ఆ విధంగా రసీదు పొందకుండా ఇసుక రవాణా చేసినట్లయితే ట్రాక్టరుకు రూ.10,000 వేలు అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్సై కోటేశ్వరావు, మైనింగ్ ఆర్ ఐ వంశీ ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును అభినందిస్తున్న మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు

మాట్లాడుతున్న ఎంపిపి కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాలేజీ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చిల్లపల్లికి పలువురు అభినందనలు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్, చిల్లపల్లి శ్రీనివాసరావు ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గం కార్యాలయంలో మంగళవారం చీరాల, వినుకొండ, గురజాల, విజయవాడ, దుగ్గిరాల, ఉండవల్లి, యర్రబాలెం, పెనుమాక, పెదవడ్లపూడి, నూతక్కి జనసేన నాయకులు, మంగళగిరి మార్కండేయ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు, మంగళగిరి సీకే జూనియర్ కాలేజ్ సీనియర్ ఉపాధ్యాయులు, స్వర్ణకారులు తదితరులు చిల్లపల్లి శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు.

ఎస్టీ కుటుంబాలకు నగదు అందజేస్తున్న తహసిల్దార్ తదితరులు

తహశీల్దార్ చొరవతో బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - దుగ్గిరాల : ఏ గుర్తింపు కార్డులేని నిరుపేద యానాదులు 20 కటుంబాలకు మంగళవారం తహశీల్దార్ ఐ సునీత చొరవతో రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఈమని, గొడవర్రు, పెదకొండూరు గ్రామ శివార్లలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ముంపు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తమకు రేషన్, ఓటు, ఆధార్, బ్యాంకు ఎకౌంట్ లాంటి గుర్తింపుకార్డులు లేవన్నారు. ఆగష్టు నెలలో కురిసిని వర్షాలకు గుడిసెలు నీళ్లల్లో తేలాయి. అప్పుడు వీరికి అత్యవసరంగా రెవెన్యూ శాఖ వారు నిత్యావసరాలు అందజేశారు. ముంపు బాధితులు ప్రభుత్వం అందజేస్తున్న రూ.10వేల సాయం వీరికి అందలేదు. మండల తహశీల్దార్ విషయాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ దృష్టకి తీసుకువెళ్లారు. తక్షణం కలెక్టర్ స్పందించి 16 కుటుంబాలకు రూ.10వేల చొప్పున లక్షా 60వేలు మంజూరు చేశారు. ప్రజాప్రతినిధులు సమక్షంలో తహశీల్దార్ సుజాత ఈమని గ్రామంలో అందజేశారు. గొడవర్రు, పెద్ద కొండూరులో ఉన్న నాలుగు కుటుంబాల వారికి బుధవారం అందచేస్తామని తాసిల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ త్రివేణి, టిడిపి నాయకులు కేశంనేని శ్రీ అనిత ఎంపిపి పసుపులేటి సాయి చైతన్య, కాసరనేని కృష్ణ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చేబ్రోలు

గ్రామాభివృద్ది ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి అధ్యక్షురాలు కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్ తెలిపారు. చేబ్రోలు ఎంపిపి కార్యాలయంలో సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మొదటిరోజు ఆమె ప్రారంభించి ప్రసంగించారు. ఎంపిడిఒ కె లలిత మాట్లాడుతు పంచాయతీరాజ్ చట్టాలు, సమావేశాలు, ప్రజాప్రతినిధులతో అవగాహన తదితర అంశాలను తెలిపారు. డాక్టర్ కోట మోహన్‌రావు ఎపిఎస్ఐఆర్‌డిపిఆర్ పర్యవేక్షులుగా నిర్వహించిన కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉషారాణి, శిక్షణ రిసోర్సు పర్సన్స్ గొడవర్రు, సుద్దపల్లి, పంచాయతీ కార్యదర్శులు బి సుబ్బారావు, జి శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివరావును అభినందిస్తున్న దొండపాడు గ్రామస్తులు

నన్నపనేని సదాశివరావుకు పలువురు అభినందన

ప్రజాశక్తి - తుళ్లూరు : టిటిడి కమిటీ సభ్యులుగా నియమించబడ్డ నన్నపనేని సదాశివరావును గ్రామస్తులు, అమరావతి ప్రాంత వాసులు మంగళవారం అభినందించారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన సదాశివరావు నాట్కో ట్రస్టీ విసి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం టిటిడి సభ్యులుగా నియమించింది. టిటిడి సభ్యులుగా నియమితులైన అనంతరం హైదరాబాద్ నుంచి తొలిసారి సోమవారం స్వగ్రామం దొండపాడు వచ్చారు. తుళ్లూరు ప్రాంతం నుంచి మొట్టమొదటిగా టిటిడి పాలక మండలిలో సభ్యులైన సదాశివరావును సన్నిహితులు, శ్రేయోభిలాషులు, మాజీ ప్రజా ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు.

నాట్కో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు

సదాశివరావు నాట్కో ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో వాటర్ ప్లాంట్, సోలార్ వీధి దీపాలు, రోడ్లు నిర్మాణంలో సాయం అందించారు. జిజిహెచ్‌లో కేన్సర్ సెంటర్‌లో రోగులకు మెరుగైన వైద్యం కోసం 2013 నుంచి వివిధ రూపాల్లో సాయం అందిస్తున్నారు. 2020లో జిజిహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ వైద్యశాలను నెలకొల్పిన ఘనత నాట్కో సంస్థదే.

బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయింపులపై హర్షం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ సంక్షేమానికి రూ.18,487 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 7,557 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళగిరి అంబేద్కర్ సెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు బుల్లా రాజారావు, రాష్ట్ర అధ్యక్షులు వట్టిపు మరియదాసు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్ద పీట వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి అనితకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ కుంగంటి రాంబాబు, సభ్యులు ప్రియానందం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎపిలో కూడా రాష్ట్ర స్థాయిలో రాష్ట్రం యూనిట్‌గా చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ సిహెచ్ నాగరాజు తెలిపారు. మంగళవారం మంగళగిరి ప్రెస్ క్లబ్ మీడియాతో మాట్లాడారు. కాలయాపన, అన్ని రంగాల్లో పూర్తిగా అమలు సాధ్యం కానీ, ఎస్సీ ఉప కులాల్లో అశాంతి అలజడి సృష్టించే జిల్లాల వారీగా వర్గీకరణ ను చంద్రబాబు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈపూరి ఆదాం మాట్లాడుతు రాష్ట్రంలో మాదిగ , మాదిగ ఉపకులాలతో పాటు ఎస్సిల్లోని అన్ని ఉపకులాల ఆర్థిక అభివృద్ధికి చంద్రబాబు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి అని అన్నారు. సమావేశంలోఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కట్టేపోగు బాబురావు, నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్ , గుంటూరు జిల్లా ఇన్చార్జి కొమరాల శ్రీనివాస రావు పాల్గొన్నారు.

రేపటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-మంగళగిరి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళగిరి శాఖా గ్రంథాలయంలో 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లుగా గ్రంథాలయ అధికారి ఎన్ ఆరోగ్యం, రికార్డ్ అసిస్టెంట్ పి కృష్ణ మంగళవారం తెలిపారు. వారోత్స వంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు, మహిళలకు అల్లికలు రంగవల్లి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వారోత్సవాల్లో పాఠకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ పి బాలస్వామి అన్నారు. మండలంలోని డోకిపర్రు యూనివర్సల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం గుంటూరు నెహ్రూ యువకేంద్ర అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన కార్యక్రమాన్ని ఉద్దేశించి బాలస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. వెయ్యికి పైగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం ద్వారా కాలుష్య తీవ్రతను తగ్గించడంతోపాటు, పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం కోటిరెడ్డి మాట్లాడుతూ మనిషికి ఒక మొక్క నాటుదాం, ఇంటికి ఒక చెట్టు నాటుదాం స్వచ్ఛమైన గాలిని పీల్చుకుందాం, చెట్లు నాటుదాం ఆరోగ్యంగా ఉందాం అని అన్నారు. కారిక్రమములో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం పర్యవేక్షకులు ఎన్. రమేష్, ఫిసికల్ డైరెక్టర్ జి. మరిరెడ్డి, పేస్ సొసైటీ వ్యవస్థాపకులు పి రమేష్ ,ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ప్రభాకర్

బేతళ ప్రభాకర్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతళ ప్రభాకర్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేట తన కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముందుగా ప్రభాకర్ యూత్ సభ్యులు సమక్షంలో కేక్ కత్తిరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వృతిరీత్యా న్యాయవాదిగా కొనసాగుతూ పలు సేవా కార్యక్రమాలు ద్వారా యువత అభిమానాన్ని చోరగోనడం హర్ష ణీయమని నాగార్జున కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కారుమంచి రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో గెడ్డటి సుందర్ సునీల్, ఎన్ఎస్ఎస్ దేవనాయుడు, ప్రభాకర్ యూత్ సభ్యులు మహంకాళి దేవి క్రాంత్(దేవి), బోడి హరీష్ బాబు, బొమ్మిశెట్టి దినేష్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉత్తమ అధ్యాపకులను అభినందించిన ఉపకులపతి కె గంగాధరరావు తదితరులు

వర్సిటీ ఉత్తమ అధ్యాపకులకు అభినందన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న అందజేసిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల జాబితాలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు అవార్డులు పొందడం సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు అన్నారు. మంగళవారం వర్సిటీలో ఆరుగురు అవార్డు గ్రహీతలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకేసారి ఆరుగురు అధ్యాపకులు ఆచార్య యం. త్రిమూర్తి రావు, ఆచార్య వై. అశోక్ కుమార్, ఆచార్య ఎన్. వి. కృష్ణారావు, ఆచార్య డి.రామచంద్రన్, డాక్టర్ పి. బ్రహ్మాజీరావు, డాక్టర్ పి పూర్ణచంద్రరావు లకు అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. బోధన, పరిశోధన రంగాలలో మీరు చేస్తున్న కృషికి ఇది నిదర్శనం అన్నారు. ఇటువంటి అవార్డులు బాధ్యతలను పెంచుతాయని పేర్కొన్నారు. పరిపాలన రంగంలో కూడా మీరు అందిస్తున్న సేవలకు అభినందనలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులతో వర్సిటీ ఖ్యాతిని పెంచాలని కోరారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓ ఎస్ డి ఆచార్య ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ .రవికుమార్, సి డి సి డిన్ ఆచార్య వీ. రవికుమార్ ,పిజి పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం .సుబ్బారావు, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి, కెమిస్ట్రీ విభాగం సీనియర్ ఆచార్యులు ఆచార్య ఆర్. రమేష్ రాజు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ త్రిమూర్తిరావుకు సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయుడిగా మహాత్మ జ్యోతిరావు పూలే చైర్ అధ్యాపకుడు ఆచార్య త్రిమూర్తి రావు చంద్రబాబు చేతుల మీదుగా సోమవారం నాడు అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన త్రిమూర్తిరావును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల బీసీ విద్యార్థి సంఘ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐపీఎస్ షరిన్ బేగం, బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోటి యాదవ్, రామకృష్ణ, మహేష్, కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న తివారి, లావు రత్తయ్య తదితరులు

విజ్ఞాన్స్‌లో స్పైరులినా ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో స్పైరులినా ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీలోని ఐసీఏఆర్- ఐఏఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఓఎన్ తివారి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరై ల్యాబ్‌ను ప్రారంభించి బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్పైరులినాను పౌడర్, క్యాప్సూల్స్, టాబ్లెట్స్ వంటి వివిధ రూపాల్లో ప్రాసెసింగ్ చేసి వినియోగదారులకు అందించడం, స్పైరులినాను ప్రోటీన్ బార్, ఎడిబుల్ స్నాక్స్ వంటి ఉత్పత్తులుగా కూడా మార్చవచ్చని పేర్కొన్నారు. స్పైరులినాకు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉందని, దీనిని ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించి దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేయవచ్చన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యకరమైన ఆహారాల డిమాండ్ పెరుగుతుందని, స్పైరులినా పౌష్టికాహార గుణాలు కలిగి ఉండటంతో ఇది మార్కెట్లో సులభంగా ఆమోదం పొందుతుందన్నారు. సూపర్‌ఫుడ్‌గా పిలువబడే స్పైరులినాలో ప్రోటీన్లు అధికంగా ఉండి 60-70 గణనీయమైన పోషక విలువలను అందిస్తుందన్నారు. ఒక గ్రాము స్పైరులినా పోషక పరంగా 300 గ్రాముల పండ్లు, కూరగాయలు లేదా మాంసానికి సమానమని తెలియజేశారు. ఫార్మాస్యూటికల్స్‌లో విలువైన ఫైకోబిలిప్రోటీన్‌ల విలువ గ్రాముకు రూ.3 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. స్పైరులినా అత్యంత పోషక ఆహారంగా ప్రసిద్ధి చెంది ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు (మెగ్నీషియం, ఐరన్, కాల్షియం) పుష్కలంగా ఉంటాయన్నారు. దీని వద్ధితో శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. స్పైరులినా సాగు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇది స్వల్ప పెట్టుబడితో, చిన్న స్థాయిలో కూడా మొదలు పెట్టవచ్చునని తెలియజేశారు. స్పైరులినా పర్యావరణానికి హానికరం కాని పద్ధతిలో పండించవచ్చని, స్వల్ప నీటితోనూ, తక్కువ భూమి అవసరంతోనూ పెంచుకోవచ్చన్నారు. దీని పెంపకం వలన మలినాల కారణంగా కలిగే పర్యావరణ ప్రభావాలు తక్కువగా ఉంటాయన్నారు. స్పైరులినాలోని పోషకాలు అతి తక్కువ సమయంలోనే శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయని, ఇది పోషకాహార లోపాన్ని అధిగమించడానికి సహాయ పడు తుందన్నారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం మెరుగు పరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్య సంరక్షణ

- గర్భిణులు, చిన్నారులకు టీకాలు
- ప్రతి బుధ, శనివారాల్లో ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచితంగా వ్యాక్సిన్
- ఫార్మాసిస్ట్‌లు, స్టాఫ్‌నర్సులకు పలు అంశాలపై శిక్షణ

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని అప్పుడే పుట్టిన చిన్నారులకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు ఇవ్వడం వలన వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవన విధానం సాగించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని ఐ.ఎం.ఎ భవన్‌లో మంగళవారం పల్నాడు జిల్లాలోని ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సలకు వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించి కోల్డ్ చైన్ మేనేజ్మెంట్, వ్యాక్సిన్ మేనేజ్మెంట్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారని కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి గీతాంజలి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్ మౌనిక వ్యాక్సిన్ నిల్వ చేయడం, లబ్ధిదారులకు చేరవేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు తీసుకొనవలసిన చర్యల గురించి వివరించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం అనంతరం బయో మెడికల్ వేస్ట్ మేనేజ్ చేయు విధానం గురించి విపులంగా తెలిపారు. గర్భిణులు, శిశువులలో వ్యాక్సినేషన్ దుష్పరిణామాలు కలిగినట్లయితే వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలిపారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో పని చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోను గుంట్ల కోటేశ్వరావు అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా విద్యార్థులు, రైతులకు తన పదవి ఉపయోగపడేలా బాధ్యతగా పని చేస్తానన్నారు. గత ఐదేళ్లలో గ్రంథాలయ నిధులను పక్కదారి పట్టించి, ఉద్యోగులకు జీతాలు లేకుండా చేశారని, దీనిని గాడిలో పెడతా నన్నారు. అందరి కష్టాలు తీర్చేందుకు సామాన్య కార్యకర్తగా ముందుంటానని దీనికై ప్రతి ఒక్కరూ సహకరించాని కోరారు. కార్యకర్తల సమస్యలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్ బాబు, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్ట కిరణ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొడ్డపాటి పేరయ్యా, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు మాజేటి వెంకటేష్, ఛాంబర్ అధ్యక్షులు వనమా సాంబశివరావు, నాయకులు షేక్ రఫీ, మందలపు వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో టిజెపిఎస్ విద్యార్థుల ప్రతిభ

కృష్ణబాబు, విల్‌స్మిత్‌ను అభినందిస్తున్న కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో బి.కామ్ విద్యార్థి జి.కష్ణబాబు ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అంతర కళాశాలల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 102 కేటగిరిలో ప్రథమ స్థానం సాధించి బంగారు పథకం కైలవసం చేసుకున్నాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి తెలిపారు.అలాగే ఇంటర్ ఎంపిసి విద్యార్థి వి. విల్స్మిత్ ఫుట్‌బాల్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఇరువురు విద్యార్థులను మంగళ వారం కళాశాల సెక్రెటరీ కె.వి.బ్రహ్మం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజీ, కోచ్ కె.అమరనాద్, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళి, డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అభ్యుదయ కాలేజీలో అవగాహన

డాక్టర్ గీతారుక్మిణికి మొక్కను అందచేస్తున్న కాలేజి డైరెక్టర్, అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు

లక్ష్మీపురంలోని స్థానిక అభ్యుదయ మహిళా కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్, ఓమేగా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు సర్వైకల్ కాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా ఓమేగా హాస్పిటల్స్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి.గీతారుక్మిణి మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ నిర్మూలించటానికి వచ్చిన వ్యాక్సిన్ గురించి వివరించారు. 14 నుండి 25 సంవత్సరాల వరకూ విద్యార్థినులకు వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయో జనాలను తెలియజేశారు. చికిత్స కంటే నివారణ మేలు అనే నానుడిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ బి.రోహిణీదేవి, రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ సభ్యులు కె.హిమబిందు, డాక్టర్ కె.పద్మజ, జి.భారతి, యం.అనురాధ, మాధవీలత పాల్గొన్నారు.

ఒకటి నుండి నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణ

ప్రజాశక్తి-గుంటూరు : నగరంలో డిశంబర్ 1 నుండి నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా ప్రజారోగ్య విభాగ కార్యాచరణ ఉండాలని, అందుకు తగిన విధంగా స్పెషల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో ప్రజారోగ్య విభాగం శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, ప్రత్యేక పర్యవేక్షణ అధికారులతో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటింటి చెత్త సేకరణకు అనుగుణంగా డివిజన్ల వారీగా ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కార్మికుల రేషనలైజేషన్ పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు పారిశుధ్య విధుల్లో కాకుండా ఉన్న వారిని వెనక్కు పిలిపించి వారికి ఆయా డివిజన్ల విధులు కేటాయించాలన్నారు. నగరంలో ఆవులు రోడ్ల మీద ట్రాఫిక్‌కి అంతరాయం కల్గిస్తున్నాయని, వాటిని అవసరమైతే వెంగళాయపాలెంలోని జిఎంసి ఆవుల షెడ్‌కి తరలించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్యా, సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ రవిబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి పాల్గొన్నారు.

కన్నబాబుకు నగర కమిషనర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ప్రత్యేక కార్యదర్శి కన్న బాబు అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ప్రత్యేక కార్య దర్శిగా భాద్యతలు స్వీకరించిన కన్నబాబును నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళ వారం వెలగపూడిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.